క్లుప్తంగా

ఆర్ఎస్ఏ ఎన్నిక ఏకగ్రీవం



బాలాజీరావును అభినందిస్తున్న సభ్యులు

కుప్పం: ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కుప్పం రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఆర్ఎస్ఎస్ యూనిట్ ఎన్నికలను జిల్లా నాయకుల పర్యవేక్షణలో నిర్వహించారు. కుప్పం రెవెన్యూ డివిజన్‌శాఖ ఆర్ఎస్ఏ అధ్యక్షుడిగా ఆర్ఎం బాలాజీరావు (డీటీ రామకుప్పం), గౌరవాధ్యక్షులుగా గుడుపల్లె తహసీల్దార్ సీతారాం, ఉపాధ్యక్షుడిగా నారాయణ, జోషి, జనరల్ సెక్రటరీగా వేణుగోపాల్, జాయింట్ సెక్రటరీగా దామోదరాచారి, చరిత్ నాయుడు, కోశాధికారిగా వెంకటాచలం, కార్యవర్గ సభ్యులుగా గోవర్ధన్, శరత్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రెవెన్యూ శాఖలో సిబ్బంది, అధికారుల సమస్యల పరిష్కారానికి తమ కార్యవర్గం కృషి చేస్తుందని నూతన అధ్యక్షుడు తెలిపారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం



శ్రీవారికి నిర్వహించిన తిరుప్పావడ సేవ

పుంగనూరు: పట్టణంలో కోనేటి వద్ద ఉన్న శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం పరిసమాప్తమయ్యాయి. ఉదయం సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి మహాశాంతి అభిషేకం చేశారు. భక్తులకు సర్వదర్శనం కల్పించారు. స్వామి వారికి తిరుప్పావడసేవ నిర్వహించారు. శ్రీవారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. రాత్రి స్వామివారికి శయనోత్సవం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ మునీంద్రబాబు పర్యవేక్షించారు.

హాల్ టికెట్ చూపిస్తే ప్రయాణం ఉచితం

గుడిపాల: నేటినుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానుండడంతో విద్యార్థులు పరీక్ష కేంద్రానికి చేరుకోవడానికి ఆర్టీసీ వారికి ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించింది. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు చాలామంది సమీప గ్రామాల్లోని పరీక్ష కేంద్రాలకు వెళ్లాల్సి ఉంటుంది. ఆర్టీసీ బస్సుల్లో కొందరు, మరికొందరు ప్రైవేట్ వాహనాలపై ఆధారపడాల్సి ఉంటుంది. అయితే వీరిపై ఎటువంటి ఆర్థికభారం పడకుండా ఆర్టీసీ నిర్ణయం తీసుకుంది. విద్యార్థులకు ఆర్థిక భారం తగ్గించింది. మండలంలో 3 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 274 మంది ఈ ఏడాది టెన్త్ పరీక్షలు రాస్తున్నారు. చిత్తూరు అర్బన్, రూరల్ మండలాల్లోని 23 పరీక్ష కేంద్రాల్లో 1,310 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

శిక్షణకు వసూళ్ల పర్వం..!

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర స్వచ్ఛదివస్ కార్యక్రమాన్ని అధికారులు శిక్షణ పేరిట ఎంచక్కా తమ జేబులు నింపుకున్నారు. చెత్తసేకరణ కేంద్రాలను వినియోగంలోకి తేవాలనే లక్ష్యాన్ని తమ ఆదాయానికి 'లక్షల' మార్గంగా మలచుకున్నారు. నియోజకవర్గ స్థాయిలో ఒకరోజు శిక్షణకు ఒక్కొక్కరి నుంచి అక్షరాలా రూ.2,500 చొప్పున వసూలు చేశారు. ఇందులో మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి అధికారులకూ వాటాలు ఉన్నాయా? అనే చర్చకు తావిచ్చింది.

- పంచాయతీ కార్యదర్శుల నుంచి రూ.2500 చొప్పన వసూలు
- నియోజవర్గ స్థాయిలో రూ.2.80లక్షలు వసూలు..?
- లబోదిబోమంటున్న పంచాయతీ కార్యదర్శులు
- ఈఓపీఆర్డీలు, ఎంపీడీఓల చేతివాటం..?



శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న డీపీఓ సుధాకర్ రావు (ఫైల్)

చౌడేపల్లె: చౌడేపల్లెలో ఈ నెల 11న పుంగనూరు నియోజకవర్గ స్థాయిలోని ఈఓపీఆర్డీలు, ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు, గ్రీన్ అంబాసిడర్లకు చెత్తసేకరణపై ఒకరోజు శిక్షణా తరగతులు నిర్వహించారు. పుంగనూరు, చౌడేపల్లె, సోమల, సదుం, పులిచెర్ల, రొంపిచెర్ల మండలాలకు చెందిన వారంతా శిక్షణకు 112మంది హాజరయ్యారు. శిక్షణ రోజున జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్‌రావు ముఖ్యఅతిథిగా మాట్లాడారు. చౌడేపల్లెలోని చెడుగుట్లపల్లె రోడ్డుమార్గంలోని చెత్తసేకరణ కేంద్రం వద్ద చెత్త సేకరణ, తడిచెత్త, పొడిచెత్త వేరుచేయడం, వర్మీ కంపోస్టు తయారీ, పంచాయతీల ఆదాయ వనరుల పెంపుపై శిక్షణ ఇచ్చారు. ఆదర్శంగా ప్రతి పంచాయతీలోని చెత్తసేకరణ కేంద్రాలను వినియోగంలోకి తేవాలని మార్గదర్శనం చేశారు. శిక్షణ అంశాల పరంగా ఇంతవరకూ బాగానే ఉంది. అయితే శిక్షణకు వసూళ్లు చేశారనే విషయంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రతి మండలంలోని ఈఓపీఆర్డీ తమకు నమ్మకమైన పంచాయతీ కార్యదర్శికి వసూళ్ల బాధ్యతను అప్పగించారు. వారు ఒకొక్కరి నుంచి రూ.2500 చొప్పున వసూలు చేశారని బయటకు పొక్కింది. ఈ లెక్కన నియోజకవర్గంలోని 112 పంచాయతీలుండగా వారి నుంచి సుమారు రూ.2.80 లక్షలు వసూలు చేశారని తెలిసింది. అయితే పుంగనూరు మండలానికి చెందిన కొందరు పంచాయతీ కార్యదర్శులు రూ:1000 మాత్రమే ఇచ్చారని, మిగిలిన వారందరూ అడిగిన మొత్తంలో నగదు ఇచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. శిక్షణ కోసం పిలిచి ఇలా డబ్బులు వసూలు చేయడం తగదని పంచాయతీ కార్యదర్శులు గగ్గోలు పెడుతుండడంతో ఈ వసూళ్ల పర్వం కాస్తా బట్టబయలైంది. దీనిపై చౌడేపల్లె మేజర్ పంచాయతీ కార్యదర్శి మహేష్‌ను ప్రశ్నిస్తే.. ఈ శిక్షణా తరగతుల నిర్వహణకు జిల్లా స్థాయి అధికారులే డీపీఆర్సీ నుంచి నిధులు కేటాయించి ఖర్చు చేశారని పేర్కొన్నారు. మరి పంచాయతీ కార్యదర్శుల నుంచి నగదు ఎవరి కోసం వసూలు చేశారు..? శిక్షణ పేరిట ఎవరు జేబులు నింపుకున్నారు? ఎవరికెంత వాటాలు? అనే విమర్శలొస్తున్నాయి. దీనిపై జిల్లా కలెక్టర్ స్పందించి విచారణ చేయిస్తే వాస్తవాల నిగ్గు తేలే అవకాశం ఉంది. ఈ విషయమై చౌడేపల్లె ఈఓపీఆర్డీ కృష్ణవేణిని వివరణ కోరగా.. తాము ఎవరి నుంచీ డబ్బులు వసూలు చేయలేదని, మీకు ఎవరో రాంగ్ ఇన్ఫర్మేషన్ ఇచ్చారంటూ దాటవేశారు.

హాస్టల్ విద్యార్థులకు రైటింగ్ ప్యాడ్లు



రైటింగ్ ప్యాడ్లు అందుకున్న విద్యార్థులు

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ బీసీ హాస్టల్ విద్యార్థులకు చెందిన పదో తరగతి విద్యార్థులకు వీ.కోటకు చెందిన ఎండీహెచ్ఎస్ ఫౌండేషన్ నిర్వాహకులు రైటింగ్ ప్యాడ్లను అందజేశారు. టెన్త్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ సోమసుందర్ రెడ్డి, పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు.

నియామకం



నియామక పత్రం అందుకుంటున్న అయూబ్‌బాషా

పుంగనూరు: పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఎస్.అయూబ్‌బాషాను నియమిస్తూ పీసీసీ అధ్యక్షుడు గాజుల భాస్కర్ నియామక ఉత్తర్వులు అందజేశారు.

పీఎఫ్ బకాయిలు చెల్లించరూ!



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్ర

కుప్పం: కుప్పం వంద పడకల ఆస్పత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు పీఎఫ్ బకాయిలను వెంటనే సంబంధిత ఏజెన్సీ ఖాతాలో జమ చేయాలని ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. ఆదివారం నిర్వహించిన ఏపీ మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు చంద్ర మాట్లాడారు. ఆస్పత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డులకు వేతనాలు వెంటనే విడుదల చేయాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చిన జీవోల ప్రకారం వేతనాలు చెల్లించకుండా కార్మికుల శ్రమను దోచుకుంటున్నారని ఆయన విమర్శించారు. ప్రభుత్వ కార్మికులకు అందాల్సిన వేతనాలను ఏజెన్సీలకు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు వెంకటేష్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ చంద్రశేఖర్, కార్మికులు పళని, రామ్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి



పలమనేరు: పొట్టిశ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆర్య వైశ్యులు

పలమనేరు: స్థానిక బజారువీధిలోని వాసవి సర్కిల్‌లో పొట్టి శ్రీరాములు 125వ జయంతి వేడుకలను ఆర్య వైశ్య సంఘ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలుగు వారిని ఏకతాటిపై తెచ్చిన ఆ మహానుభావుని త్యాగం చిరస్మరణీయమని రాచమడుగు సత్యప్రకాష్ కీర్తించారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ముందుకుపోవాలని కోరారు. కార్యక్రమంలో వాసవి వనిత క్లబ్ సభ్యురాళ్లు, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

పుంగనూరులో..

పుంగనూరు: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని ఆదివారం వాసవి క్లబ్ ఘనంగా నిర్వహించింది. తొలుత పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి, ఆయన సేవలను ప్రస్తుతించింది. అనంతరం స్థానిక వృద్ధాశ్రమంలో పేదలకు పండ్లు పంపిణీ చేసింది. కార్యక్రమంలో వాసవి క్లబ్ చైర్మన్ కృష్ణమూర్తి, రాంకుమార్, సురేష్, సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన రెడ్డిప్రకాష్

చౌడేపల్లె: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన ఆదివారం రాత్రి చౌడేపల్లె-పలమనేరు మార్గం చిట్రెడ్డిపల్లె సమీపంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం..మండలంలోని శెట్టిపేట పంచాయతీ తోటకురప్పల్లెకు చెందిన రెడ్డిప్రకాష్ బైక్‌లో చౌడేపల్లెకు వచ్చి స్వగ్రామానికి తిరుగు ప్రయాణంలో ప్రమాదానికి గురయ్యాడు. మార్గమధ్యంలో చిట్రెడ్డిపల్లె సమీపంలోని వినాయకస్వామి గుడి వద్ద రోడ్డుపై రక్తపు మడుగులో పడి ఉన్న అతడిని స్థానికులు గుర్తించి 108 కు సమాచారమివ్వడంతో హుటాహుటిన చౌడేపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అతడికి కుడికాలు నుజ్జు నుజ్జు అయింది. బైక్ టైర్ బరెస్ట్ అయి రోడ్డు పక్కన పడింది. అతడు మాట్లాడే స్థితిలో లేకపోవడంతో టైరు పేలి ప్రమాదం జరిగిందా? లేదా గుర్తు తెలియని వాహనం ఏదైనా ఢీకొందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చౌడేపల్లెలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు వాహనంలో తిరుపతికి తరలించారు.

23న 'సింహగర్జన' విజయవంతం చేయండి



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

పులిచెర్ల(కల్లూరు): ఈనెల 23న తిరుపతిలో నిర్వహించనున్న రాయలసీమ మాల మహానాడు సింహగర్జన సభను విజయవంతం చేయాలని మాల మహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణీకుమార్ పిలుపునిచ్చారు. పార్లమెంట్‌లో చట్టం చేయకుండా వర్గీకరణ పేరుతో ఎస్సీలను విడదీయాలని చూస్తే కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామన్నారు. 2004లో రాష్ట్ర ప్రభుత్వాలకు వర్గీకరణ చేసే అధికారం లేదని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. దీనిని సంబంధించి కరపత్రాలను మండలంలోని అశోక్‌నగర్ కాలనీలో మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో విడుదల చేశారు. 23న తిరుపతి సమావేశానికి భారీగా జనం తరలి రావాలన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు వర్కింగ్ ప్రెసిడెంట్ తుమ్మల రవిచంద్ర, మండల యూత్ ప్రెసిడెంట్ జట్టి మల్లి కార్జున,శ్రీకాంత్, రెడ్డీశ్వరయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో బోయకొండ కిటకిట



ప్రత్యేక అలంకారంలో గంగమ్మ

చౌడేపల్లె: జిల్లాలో రెండవ పుణ్యక్షేత్రంగా భాసిల్లుతున్న బోయకొండ గంగమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు అమ్మవారి దర్శనం కోసంతరలి వచ్చారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేక అలంకారంలో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. వర్షాలు సకాలంలో కురిసి పంటలు బాగా పండాలని, ప్రజలు, పశు సంపద వృద్ధి చెందాలని పలు గ్రామాల ప్రజలు అమ్మవారికి పూజలు చేశారు. కోర్కెలు ఫలించిన భక్తులు పిండి, నూనెదీపాలు, దీవెలతో మేళ తాళాల నడుమ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. ఆలయ ఈఓ ఏకాంబరం ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది ఉచిత ప్రసాదాలను పంపిణీ చేశారు.



బోయకొండ ఆలయంలో క్యూలలో భక్తుల రద్దీ

నోటీస్ బోర్డు

18న ఉచిత కంటి వైద్య శిబిరం

పలమనేరు: పలమనేరు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఈనెల 18న స్థానిక ఏపీ ఎన్జీవో కార్యాలయంలో తిరుపతి అమెరికన్ లేజర్ ఐ ఆస్పత్రి వైద్యులతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు పీపీఎస్ నిర్వాహకులు సుబ్రమణ్యం, నరసింహులులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. శిబిరానికి హాజరయ్యే రోగులు ఆరోగ్యశ్రీ, ఆధార్ కార్డులను తీసుకు రావాలని కోరారు. ఎంపికైన వారిని ఉచితంగా ఆపరేషన్లు చేస్తారని తెలియజేశారు.

బైరెడ్డిపల్లెలో..

బైరెడ్డిపల్లె: స్థానిక అగస్త్య పబ్లిక్‌స్కూల్ ఆవరణలో ఈనెల 18న ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మొగసాల ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు. బెంగళూరు శంకర్ నేత్రాలయ సౌజన్యంతో దీనిని ఏర్పాటు చేశామని, నేత్ర సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్య పరీక్షల్లో ఎంపిక చేసిన వారిని బెంగళూరుకు తరలించి ఆపరేషన్లు చేయనున్నట్టు తెలియజేశారు.

23న స్మారక పురస్కారాల ప్రదానం

పలమనేరు: ఈనెల 23న శ్రీరంగరాజపురం మండలంలోని ఆరిమాకులపల్లెలోని తెలుగు తల్లి కళా ప్రాంగణంలో పైనేని మునెమ్మ స్మారక పురస్కారాల ప్రదానం చేయనున్నట్టు స్థానిక తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి నిర్వాహకులు తులసీనాథం నాయుడు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇదివరకు నిర్వహించిన కథల పోటీల్లో గెలుపొందిన పదిమంది రచయితలకు నగదు పురస్కారాలతో సత్కరించనున్నట్టు తెలియజేశారు.

టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

వి.కోట: పదవ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ చంద్రశేఖర్ ఆదివారం తెలిపారు. మండలంలోని కుంభార్లపల్లె, గోనుమాకులపల్లె, వీ.కోట బాలుర, బాలిక ఉన్నత పాఠశాలలు, ఇన్‌ఫాంట్ జీసస్ పాఠశాలను పరీక్ష కేంద్రాలుగా ఏర్పాటు చేశామని, మొత్తం 1,135 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్టు చెప్పారు.

టెన్త్ పరీక్షలకు నాలుగు కేంద్రాలు

శాంతిపురం: పదవ తరగతి పరీక్షల మండలంలో నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు ఎంఈఓ చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం ఆయన పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. శాంతిపురం జూనియర్ కాలేజీ, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఏపీ మోడల్ స్కూలు, తుమ్మిశి, రాళ్లబూదుగూరు జెడ్పీ హైస్కూల్‌లో మొత్తం 728 మంది విద్యార్థులు పరీక్షలు రాసేందుకు 46 గదులను సిద్ధం చేసినట్టు చెప్పారు. నాలుగు కేంద్రాలలో ఒక్కో చీఫ్ ఎగ్జామినర్, ఒక్కో డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌తో పాటు 58 మంది ఇన్విజిలేటర్లు నియమితులైనట్టు చెప్పారు.

రొంపిచెర్లలో రెండు కేంద్రాలు..

రొంపిచెర్ల: పదవ తరగతి పరీక్షలకు రొంపిచెర్లలో రెండు కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు ఎంఈఓ శ్రీనివాసులు తెలిపారు. బాలుర ఉన్నత పాఠశాలలో 175 మంది, బాలికల ఉన్నత పాఠశాలలో 99 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారని తెలిపారు. విద్యార్థులకు డెస్కులు, తాగునీరు, ఫ్యాన్లు, విద్యుత్ లైట్లనూ ఏర్పాటు చేశామన్నారు. పరీక్షల నేపథ్యంలో 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జెరాక్స్ సెంటర్లను తెరిస్తే సీజ్ చేస్తామన్నారు.



పలమనేరు: పరీక్షకేంద్రంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎంఈవో తదితరులు

సదుంలో..

సదుం: సోమవారం నుంచి ప్రారంభం కానున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎగ్జామినేషన్ చీఫ్ సూపరింటెండెంట్ నిరంజన్‌కుమార్ తెలిపారు. స్థానిక ఉన్నత పాఠశాల కేంద్రంలో సదుం, చెరుకువారిపల్లె, బూరగమంద, పాలమంద జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఎంజేపీ గురుకుల పాఠశాల, ఓ ప్రైవేటు పాఠశాలకు చెందిన 249 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్టు ఆయన చెప్పారు.

పోలీసులా..? డోన్ట్‌కేర్..!



పలమనేరు పోలీస్ స్టేషన్



పోలీసులను బెదిరిస్తున్న కాలనీ వాసులు(ఫైల్)

- పట్టణంలో పేట్రేగుతున్న రౌడీయిజం
- గంజాయి, టెట్రా, బెట్టింగుల గ్యాంగుల జోరు
- మత్తుకు లోనై పెడదారిన పడుతున్న యువత
- ఇటీవల పోలీసులపైనే దురుసుగా ప్రవర్తించిన వైనం

పలమనేరు: జిల్లాలోనే పలమనేరు ప్రాంతానికి ప్రశాంతతకు నిలయమనే పేరుంది. ఇక్కడికి వచ్చిన ఉద్యోగులు సైతం రిటైరయ్యాక ఇక్కడే ఇళ్లు కట్టుకుని కాపురాలుంటున్న పట్టణమిది. కానీ కొంతకాలంగా పలమనేరులో కొత్త రౌడీలు పుట్టుకొచ్చి రాజ్యమేలుతున్నారు. నూనూగు మీసాలు వచ్చీ రాకనే కుర్రాళ్లు రౌడీయిజం బాట పడుతుండటం ఆందోళన కలిగిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విచ్చలవిడిగా మద్యం లభిస్తుండటం, అంతేకాకుండా ఏ సమయంలో కావాలన్నా మద్యం లభించే బెల్టుషాపులు ఉండటం, ఇక ఉత్తరాంధ్ర నుంచి పలమనేరు మీదుగా జోరుగా గంజాయి బెంగళూరుకు వెళుతూ పలమనేరుకు చేరుతోంది. దీంతో ఇక్కడ పదుల సంఖ్యలో గంజాయి స్మగర్లు వ్యాపారాలను సాగిస్తున్నారు. వీరి కారణంగా వందలాది మంది యువకులు గంజాయికి బానిసలుగా మారి చట్ట వ్యతిరేక కార్యకలాపాలవైపు ఆకర్షితులవుతున్నారు. మరోవైపు యూత్ ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగులకు అలవాటు పడి భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు.

పట్టణంలో పెచ్చుమీరిన రౌడీయిజం

పట్టణంలోని మదనపల్లె రోడ్డు, పాతపేట, గాంధీనగర్, డ్రైవర్స్ కాలనీ, గంటావూరు.. ఇలా పలు ప్రాంతాల్లో ఈ మధ్య కొత్త రౌడీలు పుట్టుకొచ్చి దాడులు, గొడవలకు దిగుతూ, సామాన్య జనాన్ని భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ముఖ్యంగా కళాశాలలకు వెళ్లే విద్యార్థుల నుంచి ఈ రౌడీయిజం విస్తరించింది. దీంతో కొత్త రౌడీల పరిచయంతో పలు కళాశాలల్లోని విద్యార్థులు సైతం వ్యసనాలకు బానిసలై గొడవలు, కక్షలకు దిగుతున్నారు. ఇక గంజాయి మత్తుకు బానిసలైన యువకులు, విద్యార్థులు, మైనర్లు సైతం పట్టణంలో తమ లోకాన్ని మరిచిపోతున్న సంఘటనలు కనిపిస్తున్నాయి.

పోలీసులంటే అస్సలు లెక్కలేదు

ఇటీవల ఓ ప్రైవేటు కళాశాలలో విద్యార్థుల మధ్య నెలకొన్న వివాదంలో రెండు గ్యాంగులు చేరి గొడవలకు దిగడం..సమాచారం అందుకుని అక్కడికి వెళ్లిన స్థానిక పోలీసులపై సైతం కొందరు దౌర్జన్యానికి దిగడం ప్రజలకు విస్తుపోయేలా చేసింది. కొందరు రౌడీల ఇళ్లలో మారణాయుధాలు సైతం ఉన్నట్టు ఇటీవల పోలీసులు గుర్తించడం చూస్తే యువత ఏవైపు పయనిస్తోందనే ఇట్టే అర్థం చేసుకోవచ్చు.

గతంలో రౌడీలపై ఉక్కుపాదం మోపిన పోలీసులు

పలమనేరు, గంగవరం అంటే పోలీసు వ్యవస్థలో ముందుగా గుర్తుకొచ్చేది శివమణి అని పేరు తెచ్చుకున్న రుషికేష్ ఇప్పటికీ ఇక్కడి జనానికి గుర్తుకుంది. ఆయన హయాంలో రౌడీలకు, ఆకతాయిలకు ముకుతాడు వేశారు. అంతకుముందు 1980లలో లక్ష్మీరెడ్డి, ఆపై రౌడీలను ఈడ్చుకుంటూ వెళ్లి కొట్టిన అనిల్‌కుమార్, శాంతిభద్రతల్లో తనకంటూ రికార్డు సృష్టించిన అల్లాబక్ష్, ఆపై నేరగాళ్ల గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన చంద్రశేఖర్, రాజశేఖర్, బాలయ్య, జయరాం నాయక్‌లాంటి పోలీసులున్నంత కాలం పట్టణంలో రౌడీయిజం ఊసే లేకుండా చేశారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పోలీసులంటే బొత్తిగా భయమే లేకుండా పోయింది. ఎవరైనా పోలీసులు కేసులు పెట్టినా అధికారపార్టీ నేతలు రంగప్రవేశం చేసి వ్యవహారాలన్నీ సెటిల్ చేస్తుండడంతో మళ్లీ కొత్త రౌడీలు పుట్టుకొచ్చి రాజ్యమేలుతున్నారు. దీనిపై జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు, డీఎస్పీ డేగల ప్రభాకర్ దృష్టి సారించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

సర్వేల భారం..పని ఒత్తిడితో హాహాకారం



గోడు వెళ్లబోస్తున్న సచివాలయ సిబ్బంది

పలమనేరు: సర్వేల కారణంగా పని భారం, ఒత్తిళ్లను భరించలేకపోతున్నామని మండలంలోని సచివాలయ సిబ్బంది ఆదివారం ఆమ ఆక్రోశం వెళ్లగక్కారు. ఆదివారం స్థానిక ఏపీ ఎన్జీవో కార్యాలయంలో వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తమపై కక్ష సాధింపు చర్యలను తీసుకొంటోందని వారు ఆరోపించారు. ముఖ్యంగా పలు రకాల సర్వేలను అంటగట్టి వాటిని సకాలంలో చేయలేదంటూ తమకు నోటీసులు ఇవ్వడం సరికాదని నిరసించారు. ముఖ్యంగా మిస్సింగ్ సిటిజన్ సర్వే, ఎంప్లాయిస్ సర్వే, వర్క్ ఫ్రం హోమ్, హౌస్ హోల్డ్ జియో టాగింగ్, పీ-4 సర్వే, డెత్ రీ-వెరిఫికేషన్, పీఏసీఎస్ సర్వే, లాథర్ ఆర్టిజాన్స్ సర్వే, ఎన్‌పీబీసీ లింకేజి, నాన్ ఏపీ రెసిడెంట్స్ సర్వే, గ్రామ ఆస్తుల సర్వే, గ్రామ ప్రొఫైల్, జనరల్ ఈకేవైసీ, పీజీఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్..తదితర సర్వేలతో ఇబ్బందులు తప్పడం లేదని వాపోయారు. ఇవి చేయాలంటే కచ్చితంగా ప్రజలు ఓటీపీ చెప్పాల్సి ఉంటుందని, దీనిని ప్రజలు సహకరించడం లేదన్నారు. దీనిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీఓ నేత ఆనంద్‌బాబు, నాయకులు లక్ష్మీపతి, సుధాకర్‌రావు, మోహన్‌రామ్, రెడ్డిప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.